క్లుప్తంగా

ఎన్‌సీసీలో చేరడం వల్ల ఎన్నో ప్రయోజనాలు



తెనాలిఅర్బన్: ఎన్‌సీసీలో చేరడం వలన ఆత్మరక్షణతో పాటు ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ లభిస్తుందని జేఎంజే కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ, ఎన్‌సీసీ అధికారిణి డాక్టర్ ఉషాక్రాంతి పేర్కొన్నారు. జాతీయ ఎన్‌సీసీ దినోత్సవాన్ని జేఎంజే కళాశాలలో ఆదివారం నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు వివిధ రకాల మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్‌టేకర్ వై.శారాసూసన్, పలువురు ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

రెండు వార్డులలో నేడు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలోని 15,32 వార్డులలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 15వ వార్డు రామలింగేశ్వరపేట సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు, 32వ వార్డు గంగానమ్మపేట సచివాలయాల వద్ద మధ్యాహ్నం 3 గంటలకు సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే సచివాలయాలలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

మున్నంగి విద్యార్థులకు ద్వితీయ స్థానం




కొల్లిపర: రాష్ట్రస్థాయి లలితా కళా ఉత్సవ పోటీల్లో మండలంలోని మున్నంగి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పారావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ గుంటూరు వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి లలితా కళాఉత్సవాల్లో పాఠశాల విద్యార్థినుల బృందగాన విభాగంలో ద్వితీయ బహుమతి సాధించడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా తెనాలి ఉపవిద్యాశాఖాధికారి నిర్మల, కొల్లిపర ఎంఈవోలు సల్మాన్‌రాజ్, ఝూన్సీవాణిలు ప్రత్యేక అభినందనలు ఫోన్ ద్వారా తెలిపారు.

వైభవంగా పడిపూజ



తెనాలిటౌన్: సుల్తానాబాద్‌లో స్వామి అయ్యప్ప పడిపూజ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి మాలధారులు చేవూరి సాంబశివరావు, సోమ శంకర్, మురళీకృష్ణల ఆధ్వర్యంలో గురుస్వాములు బట్టు గురుస్వామి, మైలా సాంబశివరావు, స్వామిపూజలు జరిపారు. శివభక్తులు, భవాని స్వాములు, అయ్యప్పస్వామి మాలధారులకు ప్రసాదం (బిక్ష) అందజేశారు. అధిక సంఖ్యలో మాలదారులు పాల్గొన్నారు.

వేబిల్లు లేని ఇసుక లారీ జప్తు



తెనాలిరూరల్: ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఒక లారీని సీజ్ చేయడంతో పాటు అధిక లోడుతో వెళుతున్న మరో రెండు లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గుర్తించి జరిమానా విధించారు. తెనాలి మండలం కొలకలూరులో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏపీ చలం సిబ్బంది ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎటువంటి బిల్లులు లేకుండ 30 టన్నుల ఇసుకను తరలిస్తున్న లారీని గుర్తించారు. సరైన పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని సీజ్ చేసి తెనాలి రూరల్ పోలీసులకు అప్పగించారు. అలానే రెండు లారీలు అధిక లోడుతో వెళుతుండడాన్ని గుర్తించి రూ. 15,250 చొప్పున జరిమానా విధించారు.

అయ్యప్ప శరణఘోషతో మార్మోగిన రేపల్లె

రేపల్లె రూరల్: పట్టణంలోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి వేల్ పూజా కార్యక్రమం కనుల పండువగా జరిగింది. గురుస్వామి ఆలపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన పంచ మండపాల పడిపూజ వైభవంగా నిర్వహించారు. అరటి మట్టలతో పంచ మండపాలను ఏర్పాటు చేసి, అయ్యప్పస్వామిని కొలువుదీర్చారు. స్వామికి పంచామృతాలు, పండ్ల రసాలు, పువ్వులతో అభిషేకాలు నిర్వహించారు.తొలుత అయ్యప్పస్వామి మాలధారులు ఓల్డ్ టౌన్‌లోని ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో వేల్‌ను ధరించారు. అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో నెలకొల్పి, పుర వీధుల్లో ర్యాలీగా రామలింగేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు.

ఘనంగా కార్తిక వనసమారాధనలు

హాజరైన మంత్రి రమేష్, ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: పట్టణంలోని వివిధ ఆలయాలు, కల్యాణ మండపాల్లో ఆదివారం పలు సంఘాల ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధనలను ఘనంగా నిర్వహించారు. జగ్గడిగుంటపాలెంలోని ఐటీఐ కాలేజ్ ఆవరణలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వన సమారాధనలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గౌడ సంఘ నాయకులు, గౌడ సంఘీయులు పాల్గొన్నారు.

■ వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కొండవీటి సేవా సమితి వారి ఆధ్వర్యంలో 18వ కార్తిక వనసమారాధన జరిపారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం వనసమారాధనలో మాట్లాడారు. కార్యక్రమాన్ని సేవా సమితి గౌరవాధ్యక్షులు పేరం సంజీవరెడ్డి అధ్యక్షులు వుయ్యూరు సంజీవరెడ్డి, సెక్రటరీ మెట్టు శ్రీనివాస రెడ్డి, కోశాధికారి కామిరెడ్డి చెన్నారెడ్డి, సేవా సమితి సభ్యులు పర్యవేక్షించారు.

■ కొత్తపేటలోని తాలూకా జూనియర్ కాలేజ్ ఆవరణలో పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రపసాద్‌లు పాల్గొన్నారు

■ బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కార్తికమాసం సందర్భంగా శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. సామూహిక వ్రత మహోత్సవంలో దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. వ్రతంలో పాల్గొన్న మహిళలను మాజీమంత్రి రాజేంద్రప్రసాద్ జ్ఞాపికలను అందజేశారు. మారీసుపేట పాతబస్టాండ్ వినాయకుని గుడి సమీపంలో పేదలకు అన్నదానం చేశారు. నిర్వాహకులు పాల్గొన్నారు.



గౌడ సంఘ వనసమారాధనలో పాల్గొన్న మంత్రి రమేష్, ఎమ్మెల్యే శివకుమార్



కొండవీటి సేవా సమితి వనసమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్



విశ్వబ్రాహ్మణుల వనసమారాధనలో పాల్గొన్న మాజీ మంత్రి రాజేంద్రప్రసాద్



వ్రత మహోత్సవంలో జ్ఞాపిక అందజేస్తున్న ఆలపాటి



వాసవీ ఆలయంలో సామూహిక వ్రతంలో పాల్గొన్న దంపతులు



వినాయకుని గుడి వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నేలకు దిగిన నక్షత్రాలు

ఆరంభమైన క్రిస్మస్ సందడి



బస్టాండ్ వద్ద ..



మారీసుపేట రెండుగేట్ల మధ్యలో..



చెంచుపేట ఆర్‌సీఎం చర్చి వద్ద ..



ఐతానగర్ లింగారావు సెంటర్‌లో..



అమ్మకాలకు సిద్ధంగా ఉన్న నక్షత్రాలు

తెనాలిఅర్బన్: ఇళ్లపైన స్టార్లు, వీధులలో శాంతాక్లాజుల సందడి, చర్చిలలో మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణ... ఇలా తెనాలి పట్టణంలో ఎక్కడ చూసిన క్రిస్మస్ సందడి కన్పిస్తోంది. సర్వలోక పాప పరిహారం కోసం పుడమికి అరుదెంచిన ఏసుక్రీస్తు జనన వృత్తాంతాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఆయనను ఆరాధించడానికి క్రైస్తవ లోకం సంసిద్ధమైంది. క్రిస్మస్ మాసం ప్రారంభమైన నాటి నుంచే తెనాలి పట్టణంలోని పలు చర్చిలకు దీపాలంకరణ చేశారు. పట్టణంలోని పలు చర్చిల నిర్వాహకులు క్యారల్స్ నిర్వహిస్తు సంఘ సభ్యుల గృహాలను దర్శించి స్వీట్లు పంపిణీ చేస్తున్నారు. ఏసుక్రీస్తు పుట్టుకకు నిదర్శనంగా క్రైస్తవులు భావించే నక్షత్రాలను అయితానగర్, మారీసుపేట, చెంచుపేట, ఇందిరానగర్ కాలనీ, చినరావూరు, ముత్తింశెట్టి పాలెం, బస్టాండ్, రైల్వే స్టేషన్ రోడ్డు వంటి ప్రాంతాలలో ఏర్పాటు చేశారు. ఇవి రాత్రి సమయాలలో కాంతులు విరజిమ్ముతూ చూడముచ్చటగా కన్పిస్తున్నాయి. అలాగే గత నెల 25 నుంచే పట్టణంలోని పలు దుకాణాల్లో ఇళ్ళపై ఏర్పాటు చేసుకునేందుకు వివిధ రకాల నక్షత్రాలను దుకాణాల్లో విక్రయిస్తున్నారు.

వరి పొలాలను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



నందివెలుగులో వరిపైరును రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట మస్తాన్‌వలి, ఈశ్వరరావులు

తెనాలిటౌన్: మిచాంగ్ తుఫాన్ దెబ్బకు దెబ్బతిన్న వరి పొలాలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ పరిశీలించారు. రూరల్ మండలం నందివెలుగు, నేలపాడు గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు లింగంశెట్టి ఈశ్వరరావు, తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చందు సాంబశివుడు, పలువురు నాయకులు పరిశీలించారు. పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరానికి రూ.50 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దారా రామకృష్ణ, పి.శివకుమార్, అయ్యప్ప, సిద్దెల రామకృష్ణ, కె.బుల్లయ్య, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

కరుణామయి ప్రార్థనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో వాక్య సందేశమిస్తున్న పాస్టర్ చంద్రబాబు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని కొమ్మమూరు కాల్వకట్ట సమీపంలో ఉన్న కరుణామయి ప్రార్థనా మందిరంలో ఆదివారం సెమి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. సంఘ కాపరి ఎం.చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఎబిఎం చర్చి కాపరి పాస్టర్ ఎన్.సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొన్నెకల్లు సంఘ కాపరి పి.జాన్‌పాల్ క్రిస్మస్ సువార్త సందేశం అందజేశారు. వృద్ధులకు దుప్పట్లు, చీరలు సంకా రాధాకృష్ణ దంపతులు పంపిణీ చేశారు. ఏబీఎం సంఘ ప్రెసిడెంట్ సుద్దపల్లి శరత్ వెంకయ్య, పాస్టర్‌లు గద్దం జాన్‌బాబు, యోబు, అజయ్‌బాబులు వాక్యసందేశం ఇచ్చారు. సంఘకాపరి చంద్రబాబు, పాస్టర్‌లు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమాన్ని సుద్దపల్లి మురళీధర్, సొపాటి మోజెలు పర్యవేక్షించారు. మహిళలు, యువకులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ



తెనాలి: అంతర్జాతీయ మానవ దినోత్సవం సందర్భంగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు రొట్టెలు, పండ్లు పంచారు. కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు మాట్లాడుతూ సామాన్య ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం 1948 డిసెంబరు 10న విశ్వ మానవ హక్కులను వెల్లడించి అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించినట్టు తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, వివిధ సంస్థలు సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని, అలాగే ప్రజలకు అడిగే హక్కు ఉందన్నారు. ఆసుపత్రి అత్యవసర విభాగం డాక్టర్ జి.దీపక్ మాట్లాడుతూ మానవ హక్కుల దినోత్సవాన్ని ఈరోజున రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీతో జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు. కౌన్సిల్ ఉపాధ్యక్షుడు చాటగడ్డ ప్రసాద్, సయ్య సుభాని, కుంగ్‌ఫూ మాస్టర్ జాని, సిస్టర్ షేక్ బషీరా తదితరులు పాల్గొన్నారు.

కఠెవరంలో కనులపండువగా కొలుపులు



కఠెవరం(తెనాలి): రూరల్ మండల గ్రామం కఠెవరంలో వేంచేసి ఉన్న శ్రీదుర్గమ్మ తల్లి దేవస్థానం వద్ద ఆదివారం అమ్మవారి కొలుపుల మహోత్సవాన్ని గ్రామస్తులు వేభవంగా నిర్వహించారు. వేకువజామునే భక్తులు కనక తప్పెట్లు, మేళతాళాల మధ్య ఊరేగింపుగా పొంగళ్లు, చద్దినేవేద్యాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకుడు నల్లగొర్ల శివయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నవితరణ చేశారు. సాయంత్రం గ్రామంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ ఊరేగింపు ఆకర్షణీయంగా సాగింది.

సంక్షేమ పథకాలను ఉపయోగించుకోవాలి

ఎంపీడీవో వి.ప్రతాపరెడ్డి



గ్యాస్ సిలెండర్ల నమూనాలను మహిళలకు అందజేస్తున్న ఎంపీడీవో ప్రతాపరెడ్డి

తెనాలిటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఎంపీడీవో వి.ప్రతాపరెడ్డి కోరారు. రూరల్ మండలం కొలకలూరులోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ కొత్తగా రేషన్‌కార్డు వచ్చిన వారికి గ్యాస్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గ్యాస్ సిలెండర్లు అందజేసే వివరాలను దుగ్గిరాల ఇన్‌సాన్ గ్యాస్, తెనాలి గ్యాస్ ప్రతినిధులు పద్మ, రవీంద్రలు వివరించారు. బీజేపీ నాయకులు పాటిబండ్ల రామకృష్ణ, ప్రతాప ప్రసాద్, కె.వాసుదేవ నాయుడు, కె.నందకిషోర్‌లు మాట్లాడారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సూరపనేని కల్పన, ఎపిఎం జయశ్రీ, పీఆర్ఏఈ వెంకటేశ్వరావు, హౌసింగ్ ఏఇ శ్రీనివాస్, వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్, పీహెచ్ఎన్ పద్మశ్రీ, కె.రామసుబ్బారావు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నూరు ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న యూత్ సభ్యులు

ఆలపాడు(వేమూరు): పొన్నూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన శ్రీనివాసరరావు అనే వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యూత్ ఆదివారం డిమాండ్ చేసింది. చుండూరు మండలం ఆలపాడు గ్రామంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు ధర్నా చేశారు. అంబేడ్కర్ విగ్రహాలుపై దాడులు చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

సేంద్రియ కూరగాయలతోనే ఆరోగ్యం పదిలం

హార్టికల్చర్ డిప్యూటి డెరెక్టర్ వీఎస్ ధర్మజ



రైతుకు సర్టిఫికెట్ అందజేస్తున్న డీడీ ధర్మజ

గుంటూరు రూరల్: సేంద్రియ కూరగాయలతో భూమి ఆరోగ్యాన్ని కాపాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు పరచవచ్చని హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ వీఎస్ ధర్మజ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సేంద్రియ వ్యవసాయంపై రైతు శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో దొరికే కూరగాయలు చాలా వరకు రసాయనాలతో పండించినవేనన్నారు. చీడ పీడల నుంచి పంటను రక్షించుకోవడానికి విచక్షణా రహితంగా రసాయనాలను పిచికారి చేయాల్సి వస్తోందన్నారు. రసాయన అవశేషాలు ఉన్న కూరగాయలను ప్రజలు తినడం వల్ల వారి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. దీనికి సరైన పరిష్కారం సేంద్రియ సాగేనని స్పష్టం చేశారు. రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీ, సేంద్రియ దిగుబడులకు మార్కెట్ వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం శుభపరిణామమన్నారు. పంటల ఉత్పత్తుల నాణ్యత పెంచడంలో తేనెటీగలు ప్రముఖ పాత్ర వహిస్తాయని తేనె టీగల పెంపకందారు చలపతిరావు తెలిపారు. సాగులో విష రసాయనాలు సహజ సిద్ధమైన తేనెటీగల ఉనికికి ఇబ్బందిని కలిగిస్తున్నాయన్నారు.

సూర్యలంక తీరంలో వ్యక్తి గల్లంతు

బాపట్ల అర్బన్: సూర్యలంక సముద్ర తీరంలో ఆదివారం విషాదం నెలకొంది. సముద్ర స్నానానికి వచ్చిన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. గల్లంతైన వ్యక్తి కోసం తీరంలో ఉన్న గజ ఈతగాళ్లు ఎంత ప్రయత్నించినా ఆచూకీ లభించలేదు. ఎక్కడి నుంచి వచ్చింది తెలియదని, ఒక్కడే వచ్చినట్లు అర్థమైందని మెరైన్ పోలీసులు అంటున్నారు.

చర్మవ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు

గుంటూరు మెడికల్: చర్మవ్యాధులు ప్రాణాంతకం కాకపోయినా, జీవన విధానం, పనితీరుపై ప్రభావం చూపుతాయని వైద్య నిపుణులు డి. అమర్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో భవనంలో ఆదివారం ఎస్‌హెచ్‌వో హైపర్ టెన్షన్ అండ్ దయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరంలో డాక్టర్ అమర్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ సారథ్యం వహించారు. డాక్టర్ అమర్ మాట్లాడుతూ మధుమేహ బాధితుల్లో బ్యాక్టీరియా, వైరల్, ఫంగల్ చర్మవ్యాధులు ఎక్కువగా వస్తాయని తెలిపారు. ముఖ్యంగా శరీరంలో తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాలైన చంకలు, గజ్జలు, ప్రత్యుత్పత్తి అవయవాలు, కాలి వేళ్ల మధ్యలో చర్మవ్యాధులు ఎక్కువగా కనిపిస్తాయని చెప్పారు. అన్ని రకాల చర్మ వ్యాధులకు ఆయింట్మెంట్లు మాత్రమే పని చేయవని వెల్లడించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయరెడ్డి మాట్లాడుతూ ప్రజలు చర్మవ్యాధులకు అంతగా ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, వీటి ప్రభావం జీవన సరళిపై పడుతుందని తెలిపారు.

రైలు నుంచి జారి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



పట్టాల వెంబడి ఉన్న మృతదేహం

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి రైల్వే స్టేషన్ వద్ద ఫ్లై ఓవర్ వంతెన సమీపంలో (మొండి గోడలు) పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. మృతుడు రైలు నుండి జారి పడి ఉంటాడని భావిస్తున్నారు. పసుపు రంగు టీషర్టు, సిమెంటు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. రాజస్థాన్‌కు చెందిన వాడై ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవ హక్కులతో సాధికారత



గోడ పత్రికలను ఆవిష్కరించిన సాయిబాబు

బాపట్ల: మానవ హక్కులు ప్రజలకు సాధికారతను ప్రసాదిస్తాయని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. 75వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం గోడ పత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. అంతర్జాతీయంగా ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబరు 10న మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను విడుదల చేసిందని సాయిబాబు తెలిపారు. మానవులందరికి సమాన గౌరవం, సమాన ప్రతిపత్తి లభిస్తాయని చెప్పారు. వెట్టిచాకిరి, బానిసత్వం వంటి ఇతర వివక్షలకు గురవకుండా ఉండే హక్కు మానవులందరికి ఉందని తెలిపారు. న్యూస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో మాజీ మంత్రి ఆనందబాబు

కొల్లూరు: స్థానిక కాకతీయ కల్యాణ మండపంలో విజయవాడ హెల్ప్ వైద్యశాల ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్ సహకారంతో వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. మాజీ మ్రంతి నక్కా ఆనందబాబు ప్రారంభించారు. శిబిరంలో 220 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మరో 35 మంది రోగులను మెరుగైన వైద్య పరీక్షల కోసం విజయవాడ వైద్యశాలకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్, సుగ్గునలంక సర్పంచ్ శీలం అంకమ్మరావు, కొల్లూరు వైస్ సర్పంచి దూళిపూడి కృష్ణ, వేమూరు మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ శిగిలిశెట్టి రాఘవరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో పాల్గొన్న నూరి ఫాతిమా, డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ షమా సుల్తానా

గుంటూరు మెడికల్: ఉచిత వైద్య శిబిరాల్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా సూచించారు. పొన్నూరు రోడ్డు హుస్సేన్ నగర్‌లో యువ నారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్, హోప్ విన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన వైద్యసేవల్ని అందిస్తున్న హోప్ విన్ హాస్పిటల్స్‌కు అభినందనలు తెలిపారు. హోప్ విన్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ షమా సుల్తానా మాట్లాడుతూ కళాశాలలు, పాఠశాలలు, నగరంలోని మురికివాడల్లో ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలు, మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్ని చైతనవంతుల్ని చేస్తున్నామని చెప్పారు. సీనియర్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్, హోప్‌విన్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నజీరుద్దీన్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో 400 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు కూడా ఉచితంగా అందజేసినట్లు తెలిపారు.